క్లుప్తంగా

బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన నిరుపేద ఒంటరి మహిళ కొరికాన గున్నమ్మ కొంతకాలంగా వెన్నుపూస సమస్యతో బాధపడుతోంది. అసలే పేదరికం, ఆపై వైద్యం చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ స్పందించింది. గురువారం బాధితురాలికి పది వేల రూపాయల నగదుతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు సావాడ గణేష్ రెడ్డి, నీలాపు దుర్యోధనరెడ్డి, దక్కత శంకర్, నీలాపు హేమరాజులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కంచిలి: బాల్య వివాహాలను నిర్మూలిద్దామని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ రోజా రమణి అన్నారు. కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో కలిసి ఈ మేరకు గురువారం ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాతో కలుగుతున్న అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: కంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవల్ని మరింత మెరుగుపర్చి, కమిటీ తరఫున అభివృద్ధికి అధ్యక్షునిగా కృషి చేస్తానని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ రోగులకు అందిస్తున్న సేవలు, మందుల సరఫరా, మౌలిక సౌకర్యాలు, పరిశుభ్రత తదితర అంశాలను కమిటీ సభ్యులు పరిశీలించారు. పలు తీర్మానాలు చేశారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, వైద్యాధికారి డాక్టర్ టి.హరిబాబు, డాక్టర్ ఎస్.నాగేంద్ర పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలని వినతి


విప్ అశోక్‌కు సావనీర్ అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి కోరారు. ఈమేరకు ప్రభుత్వ విప్ అశోక్‌ను రామయ్యపుట్టుగలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఏపీటీఎఫ్(1938) శాఖ 20వ విద్యా వైజ్ఞానిక రాష్ట్ర సభలలో విడుదల చేసిన సావనీర్‌ను విప్‌కు అందజేశారు.

పాఠశాల దాతల సాయం


కంప్యూటర్‌ను అందజేస్తున్న వెంకట వరప్రసాదరావు

కవిటి: కొత్తకొజ్జీరియా జెడ్పీ ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ డీఎస్పీ శమళ్ల వెంకటవరప్రసాదరావు రూ.35 వేల విలువైన కంప్యూటర్‌ను, ముత్యాలపేట పాఠశాలకు చెందిన ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు బల్లెడ లక్ష్మణమూర్తి రూ.పది వేల నగదును వితరణగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మురపాల జగన్నాథం మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కొజ్జీరియా గ్రామపెద్దలు ఉప్పాడ కబీర్‌దాస్, పిట్ట దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూర్పు యంత్రం పడి ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక భవానీనగర్ రోడ్డులో గురువారం రాత్రి నూర్పు యంత్రం పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నందిగాం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కంచరాన రాముకు చెందిన నూర్పు యంత్రం మొరాయించడంతో టెక్కలి భవానీనగర్‌లో ఉన్న మెకానిక్ షాపు వద్దకు తీసుకొచ్చారు. అక్కడ సిబ్బంది బాగు చేస్తుండగా ఒక్కసారిగా ఆ యంత్రం సమీపంలో ఉన్న టెక్కలి చేరి వీధికి చెందిన డొంకాన శంకరరావు, రాములపై పడిపోవడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు బాధితులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

సాగునీటి ఎన్నికల కోలాహలం!

- పొలాలకు సక్రమంగా అందని సాగునీరు
- నీటితీరువా మాత్రం వసూలు
- డిసెంబర్ 5న ఎన్నికల నోటిఫికేషన్
- 8న ఎన్నికలు


వంశధార ఎడమ కాలువ

పలాస: వంశధార ఎడమ కాలువ పలాస సబ్ డివిజన్ పరిధిలో వాటర్ యూజర్స్ అసోసియేషన్ ఎన్నికలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీంతో గ్రామాల్లో నీటి సంఘం ఎన్నికల హడావుడి మొదలైంది. అయితే ఏటా ఎకరాకు రూ.200 చొప్పున నీటి తీరువా రెవెన్యూ యంత్రాంగం వసూలు చేస్తున్నప్పటికీ పొలాలకు మాత్రం సాగునీరు అందడం లేదనే విమర్శలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. దీనికి కారణం లేకపోలేదు. పలాస నియోజకవర్గంలోని పలాస, వజ్రపుకొత్తూరు మండలాల శివారు భూములకు కొన్నేళ్లుగా నీరు అందడం లేదు. వర్షాలు పడితే తప్పితే ఆ భూములకు నీరు అందదు. ఈ ఏడాది కూడా మొదట్లో ఈ కాలువ ద్వారా నీరు వచ్చినా ఆ తర్వాత మళ్లీ మొదటికే వచ్చింది. అదృష్టవశాత్తు ఈఏడాది వర్షాలు బాగా పడటం వల్ల సాగునీటి ఇబ్బందులను రైతులు ఎదుర్కోలేదు. ప్రస్తుతం వరి కోతలు జరుగుతున్న సమయంలో నీటి సంఘాల ఎన్నికలు సమీపించడంతో రాజకీయ నిరుద్యోగులు గ్రామాల్లో హడావుడి చేస్తున్నారు.

7,608 మంది ఓటర్లు

పలాస వంశధార సబ్ డివిజన్ పరిధిలోని నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని 125 గ్రామాల్లో వరిపంటను సాగు చేస్తున్నారు. వీటి పరిధిలో మొత్తం 7,608 మంది రైతులు ఓటర్లుగా ఉన్నారు. ఈ రైతులకు 18,390 ఎకరాల్లో పొలాలు ఉన్నాయి. వీరంతా వంశధార ఎడమ కాలువ పరిధిలో ఉన్న రైతులు. ఈ రైతులతో నీటి సంఘాలను ఏర్పాటు చేసి, వారి ఆధ్వర్యంలో నీటి సరఫరా జరిగేటట్టు యాజమాన్య చర్యలు తీసుకోవడానికి ఈ నీటి సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఇందులో భాగంగా డిసెంబర్ ఐదో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకానుంది. ఎనిమిదో తేదీన ఎన్నికలు నిర్వహించడానికి గ్రామ సభలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో గ్రామాల్లో హడావుడి మామూలుగాలేదు. స్థానిక సంస్థల ఎన్నికలను తలపించే విధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఎన్నికలు ఇలా..

పలాస సబ్ డివిజన్ పరిధిలో నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని కవిటి, లక్ష్మీపురం, అంతరకుడ్డా, అమలకుడియా, వీరభద్రాపురం, నగరంపల్లిలో నీటి సంఘాలు ఉన్నాయి. అలాగే 12 టెరిటోరియల్ కాన్సిటెన్సీ (టీసీ)లు ఉన్నాయి. వీటి ఎన్నికలను సకాలంలో పూర్తిచేయడానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటుంది. ఎన్నికలు ఏవిధంగా జరుగుతాయన్నది వేచి చూడాలి.

నీరు ఇస్తేనే తీరువా వసూలు చేయాలి..



పొలాలకు నీరు ఇస్తేనే నీటి తీరువా వసూలు చేయాలి. పొలాలగు నీటిని ఇస్తున్నదీ.. లేదనిది అధికారులకు తెలిసి ఉండాలి. కొన్నేళ్లుగా వర్షాధారంతోనే పంటలు పండిస్తున్నాము. ఈ ఏడాది ముందుగా కొద్దిగా నీరు వచ్చినా అది చాలలేదు. వర్షాలు అడపాదడపా పడ్డాయి కాబట్టి ఏదో కాస్తా పంట చేతి కొచ్చింది. నీటి సంఘాలు మంచివే. అవి రైతులకు ఉపయోగపడాలి. కాలువల్లో పూడికలు కూడా తీయకపోతే ఎలా?. నీటి తీరువా డబ్బులు ఎక్కడకి వెళ్తున్నాయి. సంఘాల్లో నిజమైన రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

–బి.రామారావు, రైతు, తుంబవాని పేట, వజ్రపుకొత్తూరు మండలం

నీటి సంఘాలు ఉపయోగమే..



నీటి సంఘాలు రైతులకు చాలా ఉపయోగం. అయితే ఎన్నికలు అనేవి సక్రమంగా నిర్వహించాలి. ఒక గ్రామంలో ఎంతో సన్నిహితంగా ఉన్న రైతుల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉండకూడదు. అసలే నీటి కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ఈ ఎన్నికల వల్ల వారి మధ్య విభేదాలు వస్తే ఇబ్బందిగా ఉంటుంది. నిజాయితీగా ఎన్నికలు జరిపించాలి. రాజకీయాలకు అతీతంగా జరగాలి.

– ఉంగ సాయిక్రిష్ణ, వంశధార ప్రాజెక్టు కమిటీ మాజీ వైస్ చైర్మన్, మోదుగులపుట్టి, పలాస

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

- ఆర్డీవో వెంకటేష్


మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేష్

కాశీబుగ్గ: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని పలాస ఆర్డీవో గ్రంధి వెంకటేష్ అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వివిధ విభాగాల ప్రతినిధులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు లోబడి స్కానింగ్ సెంటర్లు నడపాలని కోరారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ తాడేల శ్రీకాంత్ మాట్లాడుతూ.. స్కానింగ్ సెంటర్‌కు వచ్చే ప్రతి గర్భిణి వివరాలను నమోదు చేసిన తరువాత సిస్టంలో అప్లోడ్ చేసి డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపించాలన్నారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ సూర్యకళ, డీఈఎంఓ వెంకటేశ్వర్లు, డీపీఎంఓ వాన సురేష, పలాస ఏపీఎన్జీవో అధ్యక్షులు బోనెల గోపాల్, వైద్యులు మల్లేశ్వరరావు, విజయకుమార్, దంతం భీమారావు, మంజుల, గాయత్రి, మౌనిక, శృతి, న్యాయవాది ఉషారాణి పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా కార్యదర్శి

టెక్కలి: టెక్కలి శాఖా గ్రంథాలయాన్ని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి బి.కుమార్‌రాజా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులు, పుస్తకాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈయన తో పాటు కేంద్ర గ్రంథాలయం డీఎల్ వీవీఎస్ శంకరరావు, స్థానిక గ్రంథాలయాధికారి బి.రూపావతి ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

కవిటి: మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని స్థానిక మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రవి కుమార్ అన్నారు. కవిటిలో జగన్నాథ ఇన్‌లాండ్ ఫిషర్‌మ్యాన్ సొసైటీ సభ్యులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. పరిశీలకుడు చిట్టినాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్వదేశీమత్స్య సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పాటు చేయాలని మండల మత్స్యశాఖ అధికారి కె.రవికుమార్, రాష్ట్ర పరిశీలకులు చిట్టినాయుడు అన్నారు. పట్టణంలోని కండ్రవీధిలో స్వదేశీ మత్స్యకారులతో జిల్లా మత్స్యశాఖాధికారి పి.వి.శ్రీనివాసరావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు వై.సత్యన్నారాయణ వారి ఆదేశాల మేరకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫీల్డ్‌మెన్ బాలాజీ, మత్స్యశాఖ సహాయకులు ముబీన్, సాగరమిత్ర పి.వి.రమణ, రాజేంద్రబెహర పాల్గొన్నారు.

చేప పిల్లలు పంపిణీ

టెక్కలి రూరల్: సీతంపేట ఐటీడీఏ ఆర్థిక సహకారంతో టెక్కలి మండలంలోని గిరిజన ప్రాంత మత్స్యకార రైతులకు స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది సమక్షంలో గురువారం చేపపిల్లలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ విషయాన్ని టెక్కలి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ధర్మరాజ్ పాత్రో తెలిపారు. ఈ మత్స్య సంపద వలన గిరిజనులకు ఉపాధి చేకూరుతోందన్నారు. చేపల పిల్లలను పెద్ద భీంపురం, వంగర, సరియాపల్లి, జీడిపేట, సన్యాసిపేట, సవరసోర్లిగాం, కండికిపేట గిరిజన గ్రామాల్లోని చెరువుల్లో విడిచి పెట్టారు. మత్స్యశాఖ సహాయకులు బి.మధుసూదన్, కాంతి, శ్రీకాంత్ ఉన్నారు.

జీడి పారిశ్రామికవాడ సంఘ కోశాధికారి మృతికి సంతాపం

కాశీబుగ్గ: పలాసకు చెందిన ప్రముఖ జీడి వ్యాపారి, జీడి పారిశ్రామికవాడ సంఘ కోశాధికారి శాసనపురి శ్రీనివాసరావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. పలాస ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో పరిశ్రమకు యజమానిగా, వ్యాపారవేత్తగా పరిచయస్తుడు. ఇండస్ట్రీయల్ ఎస్టేట్ సంఘానికి గత పద్దెనిమిది సంవత్సరములుగా కోశాధికారిగా అనేక సేవలు అందించారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. సంఘం తరఫున నివాళిలు అర్పించారు.


శ్రీనివాసరావు(ఫైల్)

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


సోంపేట: కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు


కాశీబుగ్గ: కబడ్డీలో పోటీపడుతున్న క్రీడాకారులు

సోంపేట: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గొనకపాడు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థాయి విద్యార్థులకు మండల స్థాయిలో గ్రిగ్స్ పోటీలు పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, తదితర పోటీలు నిర్వహించారు. ఇక్కడ రాణించిన విద్యార్థులు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. జాగృతిస్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు కార్తికేశ్వరరావు, ఈశ్వరరావు, పద్మావతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

కాశీబుగ్గ: పలాస క్రీడా మైదానంలో మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కబడ్డీ సీనియర్ బాలుర విభాగంలో కాశీబుగ్గ జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల విభాగంలో శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు గెలిపొందారు. అలాగే సీనియర్ ఖోఖో బాలుర విభాగంలో పలాస ఎంజేపీ పాఠశాల, జూనియర్ విభాగంలో చిన్నబడాం విద్యార్థులు విజయం సాధించారు. ప్రధానోపాధ్యాయులు డాక్టర్ దాసరథి, నాయకులు మల్లేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ తాతయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు, సీహెచ్ పద్మలోచన, వై.కె.హరినాథ్, ఎస్.రామారావు, టి.గణేష్, సీహెచ్ రాంజీ, డి.సంతోష్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వివాహిత మృతి కేసులో ముగ్గురు అరెస్టు

కాశీబుగ్గ: వివాహిత మృతి కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. పలాస మండలం ఈదురాపల్లి గ్రామంలో ఈ నెల 25వ తేదీన వివాహిత పైల నీరజాక్షి (24) అనుమానాస్పదంగా మృతి చెందింది. దీనికి అత్తింటివారి వేధింపులే కారణమని మెళియాపుట్టి మండలం టకోయి గ్రామానికి చెందిన మృతిరాలి తండ్రి సంపతిరావు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన కాశీబుగ్గ సీఐ డి.మోహనరావు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో భర్త వినోద్, అతని తండ్రి మాధవరావు, సోదరి రజనిని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా.. జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోంపేట: మండలంలోని బుసాబద్ర 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఓ ప్రకటలో తెలిపారు. పాత్రకొండ బుసాబద్ర, మాకన్నపురం, సుంకిడి పంచాయతీలకు సరఫరాను నిలిపి వేస్తామని..వినియోగదారులు సహకరించాలని కోరారు.

టెక్కలి: టెక్కలిటౌన్ పరిధిలో ఫీడర్–1,2 పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ జి.శంకరరావు తెలిపారు. వార్షిక మరమ్మతుల కారణంగా తెంబూరు రోడ్, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతం, గ్యాస్ ఏజెన్సీ, సబ్ కలెక్టర్ కార్యాలయం, ఎన్‌టీఆర్ కాలనీ, శ్రీనివాసానగర్, పాత ప్రభుత్వ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

మహాలక్ష్మమ్మకు పూజలు

కంచిలి: మండలంలోని కర్తలి గ్రామంలో వెలసిన మహాలక్ష్మమ్మ అమ్మవారికి మార్గశిర గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు అభినందనలు

పలాస: రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మందస మండలం సొండిపూడి హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను ఉపాధ్యాయ సిబ్బంది గురువారం అభినందించారు. విద్యార్థులు బాడ శ్రీజ, భాగ్యలక్ష్మి, డొక్కరి మాధవి, మద్దిల చరణ్, దేవరాజు తదితరులు పోటీలో ప్రతిభ కనబర్చారు. ప్రధానోపాధ్యాయులు సుందర సాల్మన్, అప్పారావు ఉన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ: రాష్ట్ర నైపుణ్యాభావృద్ధి సంస్థ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లల్లో ఉపాధి శిక్షణ కోర్సులకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా పలాస నియోజకవర్గ హబ్ పరిధిలో డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటీఐలో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్స్‌ను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి.. ఆ పైన విద్యార్హత కలిగి 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉన్న మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాల కోసం 63010 46329 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల ప్రతిభ..



స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఇచ్ఛాపురం మండలం డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హెచ్ఎం జె.సరోజని తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు కారంపూడిలో జరిగిన రాష్ట్రస్థాయి బాలికల ఖోఖో పోటీల్లో జిల్లా తరఫున పాల్గొన్న డి.మీనా, బి.ధనలక్ష్ రజత పతకం దక్కించుకోగా, బాలుర విభాగంలో బి.కార్తీక్, బి.జస్వంత్‌లు ప్రత్యేక బహుమతులు పొందారన్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కోచ్ వజీర్ అహ్మద్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

–ఇచ్ఛాపురం రూరల్

కదిలింది శ్రీసాయి పల్లకీ..



ఇచ్ఛాపురం మండలంలోని బుడ్డేపుపేట షిర్డీసాయి ఆలయ 18వ వార్షికోత్సవ ఉత్సవాన్ని గ్రామస్తులు, భక్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. 41 రోజుల షిర్డీ సాయి మాలధారణ చేసిన స్వాములు ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకిలో సాయి పాదుకల్ని ఉంచి కుటుంబ సమేతంగా కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

ఆర్థిక సాయం..



సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన కంబాల ముకుందరెడ్డి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. తాజాగా కాలుకు కూడా ఇన్ఫెక్షన్ సోకింది. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉద్దానం అభ్యుదయ సేవాసమితి సభ్యులు పది వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడు తల్లి లక్ష్మికి గురువారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. సమితి అధ్యక్షుడు తామాడ లక్ష్మణరావు, ఎం.మహేష్, నీలయ్య, రవి పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

పిల్లలకు వైద్య పరీక్షలు..



దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు, సంరక్షకులు, బోధకులు అశ్రద్ధ చేయవద్దని సోంపేట సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము అన్నారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఉచిత వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించి అవసరమైన పిల్లలకు మందులను అందజేశారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు టి.చంద్రశేఖర్, పి.నిర్మల, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈఓలు ఎస్. శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, పాఠశాల హెచ్ఎం సీతారాంనాయుడు పాల్గొన్నారు.

పులి సంచరిస్తుంది..జాగ్రత్త!

- అటవీశాఖాధికారుల హెచ్చరిక



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అటవీ సిబ్బంది (ఇన్‌సెట్లో) పెద్దపులివిగా భావిస్తున్న పాదముద్రలు

కాశీబుగ్గ: ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రాలోకి పెద్ద పులి ప్రవేశించిందని.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం జిల్లా అటవీశాఖ అధికారులు గురువారం హెచ్చరికలు జారీ చేశారు. మందస మండలం సాబకోట, బుడంబో గిరిజన పంచాయతీల పరిధిలో కొండలు, వాగులూ, రిజర్వు ఫారెస్టులో తిరుగుతూ జిల్లాలోకి ప్రవేశించినట్టు భావిస్తున్నారు. ఒడిశా నుంచి నేరుగా మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ఉన్న సముద్రతీర జీడితోటల మీదుగా సంతబొమ్మాళి మండలంలోకి చేరి తిష్టవేసిందని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఫారెస్టు అధికారులు గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు పంచిపెట్టారు. పెద్ద పులి తిరుగుతున్న ప్రాంతాలలో మూగజీవాలను తోటలో కట్టకుండా ఇంటి సమీపంలో పటిష్టమైన శాలల్లో కట్టుకోవాలని, చీకటిపడిన అనంతరం ఒంటరిగా, నిర్మానుష్య ప్రాంతంలో పర్యటించడం వంటివి మానుకోవాలని, ఆరుబయట, పశువుల పాకల వద్ద ఎవరూ నిద్రించవద్దని సూచించారు. చిన్నారులు ఆరుబయట ఆడుకోవడం, వేకువజామున, చీకటి పడిన అనంతరం బయట తిరగడం చేయవద్దని తెలిపారు. ఫారెస్టు అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తుంటామని చెప్పారు. ఎవరూ పులి సంచారంపై లేనిపోనివి ప్రచారం చేయవద్దని హితవు పలికారు. పులి వేలిముద్రలు కనిపిస్తే సమాచారం అందించాలన్నారు. ఆవులు, మూగజీవాలను చంపితే వాటిని ముట్టుకోవద్దని, పులి అదే ప్రాంతానికి తిరిగి వచ్చే అవకాశం ఉన్నందున ఆ ప్రాంతంలో తిరగవద్దన్నారు.

జ్యోతిరావు పూలే ఆశయాలను సాధించుకుందాం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్


టెక్కలి: జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పేరాడ తిలక్, నాయకులు


టెక్కలి సాంఘిక సంక్షేమ వసతి గృహంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు


సోంపేట: జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘనేతలు

టెక్కలి: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావు పూలే ఆలోచన ఆశయాలను సాధించుకునేందుకు ప్రతీ ఒక్కరూ పోరాటాలు చేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. గురువారం టెక్కలిలో నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పూలే వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం ఎంపీపీలు అట్ల సరోజనమ్మ, ఎస్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు డి.వెంకట్రావు, నాయకులు కె.బాలకృష్ణారావు, సత్తారు సత్యం, ఎ.రామారావు, పి.వెంకట్రావు, పి.రమేష్, హెచ్.వెంకటేశ్వర్రావు, కె.సంజీవరావు, జె.జయరాం, పి.మోహన్, ఎం.నాగభూషణ్, ఎస్.బాలకృష్ణ, డి.పోలయ్య, యు.తమ్మయ్య, బి.తులసీరావు, తిరుమలరెడ్డి, ఆర్.జయమోహన్, పి.రమణబాబు డి.రామకృష్ణారెడ్డి, ఎ.విష్ణు, టి.జగ్గారావు, బి.ఉదయ్, బి.ప్రభాకర్, హేరంబో, మదీన్, రాజేష్, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే..

సోంపేట: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు అన్నారు. సోంపేటలోని చిల్డ్రన్స్ పార్క్ వద్ద జ్యోతిరావు పూలే వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి తరం యువత పూలే జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సంఘనేతలు బల్ల జానకీరావు, పిట్ట హేమచంద్రరావు, బి.హరి, విజయ్‌కుమార్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలనకు పూలే కృషి

కాశీబుగ్గ: అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళలు, అణగారిన వర్గాలకు విద్యావకాశాలు అందించడంలో కృషి చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కొనియాడారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం కృషి చేసిన ఆయన గొప్పదనాన్ని జ్యోతిరావు పూలే వర్థంతి సందర్భంగా నేటితరం విద్యార్థులు స్మరించుకోవాలన్నారు. ఆదేస్ఫూర్తితో సమాజ, దేశ అభ్యున్నతికి కృషిచేయాలని అప్పలరాజు పిలుపునిచ్చారు.